కథ

వి.శ్రీదేవి

# ఆధిపత్యం

హాల్లో సోఫాలో కూర్చుని టీవీ చూస్తున్న భానుమతి మనసులో బడబాగ్నులు చెలరేగుతున్నాయి. ఆమె చూపులు టీవీలో వస్తున్న సీరియల్ మీద ఉన్నట్లనిపిస్తున్నా అంతరంగం మాత్రం అసహనంతో రగిలిపోతోంది.

ఆమె ఇంతగా మానసిక కల్లోలానికి గురికావటానికి కారణం ఆమె ఒక పథకం ప్రకారం రచించుకున్న స్వీయప్రణాళిక భగ్నం కావటమే. పుట్టింట్లో తన తల్లీ తండ్రీ, అన్నదమ్ములు మాత్రమే కాదు వచ్చిన మరదళ్లు కూడా తన కనుసన్నలలోనే మసలేవారు. చుట్టాలూ పక్కాలు తన సలహా సంప్రదింపులే తీసుకునేవారు. పెళ్లి అయ్యాక అత్తా, మామలు తనకు వ్యతిరేకంగా ఉన్నాగానీ భర్తను మాత్రం తనకిష్టం వచ్చిన రీతిలోనే మలచుకోవడంలో సఫలీకృతురాలైనది. తన కన్న పిల్లలు కూడా తన మాట జవదాటేవారు కాదు. అసలు స్వాతి పెళ్లి గురించి తాను ఏం ఊహించుకున్నదీ ఇప్పుడు ఏమి జరుగుతున్నది? అనుకుంటుంటే గతమంతా ఒకసారి కళ్లముందు కదిలింది.

భానుమతి భర్త రాజారావు బ్యాంకు ఉద్యోగి. అత్తమామలకు శారద రాజారావు ఇద్దరే సంతానం. శారదను మేనల్లుడికి ఇచ్చి చేసిన సూర్యకాంతమ్మ తనకు, కొడుక్కీ నచ్చిన భానుమతిని ఇచ్చి చేసింది. అదేం పాపమోగానీ ఏ ముహూర్తాన భానుమతి రాజారావు జీవితంలోకి అడుగు పెట్టిందో గానీ ఆనాటి నుండీ సూర్యకాంతమ్మకు భానుమతికీ మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనేది. పెళ్లికి ముందు ఒకరిలో మరొకరికి నచ్చిన లక్షణాలన్నీ పెళ్లయ్యాక అవలక్షణాలుగా కనిపించసాగాయి. ఇద్దరూ ఎదుటివారి ఆధిక్యతను అంగీకరించనివారే. ఒకరు చేసిన పని మరొకరికి నచ్చేది కాదు. కోడలిని



అదుపులో పెట్టాలని అత్తగారు, అత్తగారి లెక్కేమిటని కోడలు ఉండేవారు. ఇద్దరిమధ్య నలిగిపోయేవారు రాజారావు, ఆనందరావు. వారి జీవితాల్లో సుఖం, సంతోషం అనేవి కనుమరుగయ్యాయి.

రాజారావు ట్రాన్స్‌ఫర్ మీద హైదరాబాద్ వెళ్లిపోవటంతో సూర్యకాంతమ్మ, ఆనందరావు పల్లెటూర్లో సొంత ఇంట్లో పెన్షన్‌తో ఇంటి అద్దెలతో మెయిన్‌టెయిన్ అయ్యేవారు. ఒకచోట ఉన్నపుడే అంతంతమాత్రంగా ఉండే సంబంధ బాంధవ్యాలు ఇప్పుడు మరీ పల్చబడ్డాయి. తల్లీ తండ్రీ వృద్ధాప్యంలో ఒంటరిగా ఉండటం రాజారావు మనసుకు ఎంతో బాధగా ఉన్నా మౌనంగా అస్సహాయంగా ఉండిపోయేవారు. సూర్యకాంతమ్మ కూడా అంత పట్టుదలగానే "మనం ఏమన్నా వాళ్ల మోచేతినీళ్లు తాగుతున్నామా? ఇంతవాణ్ని చేసిన విశ్వాసం వాడికి లేకపోయినంత మాత్రాన మనకు వచ్చిన నష్టం ఏమీ లేదు" అంది ధీమాగా.

రోజులు నెలలుగా, సంవత్సరాలుగా మారుతున్నాయి. రాజారావు కొడుకు రవి ఎం.టెక్ చేశాడు. కూతురు స్వాతి బీటెక్ పూర్తి చేసింది. భానుమతి కూతురు పెళ్లి అయ్యాక కొడుక్కి కూడా పెళ్లి చేసి కొడుకు, కోడళ్లను తన గుప్పిట్లో పెట్టుకోవచ్చని ఆశించింది. తానొకటి తలిస్తే దైవం మరొకటి తలిచినట్లు ఆమె ఊహలన్నీ తలక్రిందులయ్యాయి. దురదృష్టవశాత్తూ రవి రోడ్ యాక్సిడెంట్లో అక్కడికక్కడే చనిపోవటంతో రాజారావు దంపతులు జీవచ్ఛవాల్లా తయారయ్యారు. ఇంక మిగిలిన కూతురు స్వాతి మీద పంచప్రాణాలు పెట్టుకుని బ్రతకసాగారు. అనుకోకుండా స్వాతికి మంచి సబంధం కుదిరింది. అబ్బాయి కిరణ్ సి.ఏ. చేశాడు. వాళ్లు కోటీశ్వరులు. కిరణ్ ఒక పెళ్లిలో స్వాతిని చూసి ఆమెనే పెళ్లి చేసుకోవాలని నిశ్చయించుకోవటం, పెద్దవాళ్లతో సంప్రదించి రాజారావుకు మధ్యవర్తితో కబురు పంపించడం జరిగింది.

కొడుకు హఠాన్మరణం నుండి అప్పుడే కోలుకుంటున్న భానుమతికి ఈ వార్త చెప్పలేనంత సంబరాన్ని కలిగించింది. 'తన కూతురు తన కంటే అదృష్టవంతురాలన్న మాట. నా బంగారు తల్లి' అని కూతురుని చూసుకుని మురిసిపోయింది. అయితే ఆ మురిపెం తాత్కాలికమేనని కేవలం పైపై మెరుగులకే విలువనిచ్చే ఆమె తెలుసుకోలేకపోయింది.



పెళ్లి వారి ఐశ్వర్యం గురించి విన్న భానుమతికి నోట మాట రాలేదు. వాళ్లకు హైదరాబాద్ మాదాపూరులో 4 ఫ్లాట్స్, విజయవాడలో 2 మేడలు, బెంగళూరులో రెండు ఫ్లాట్స్ ఉన్నాయట. అంతేకాక వాళ్ల స్వగ్రామంలో 80 ఎకరాల పంట పొలాలు, కొబ్బరితోటలు లెక్కలేనంత బంగారం ఉన్నదని, అయితే ఎవరికీ వీసమెత్తు గర్వమూ లేదని తెలుసుకున్నది. అన్నీ తీపి కబుర్లే వింటున్న భానుమతికి మధ్యవర్తి చెప్పిన చివరి మాటలు మాత్రం మింగుడు పడని చేదు మాత్రలయ్యాయి.

పెళ్లివారు ఆచారాలకు, సంప్రదాయాలకు ఎనలేని గౌరవం ఇస్తారట. కిరణ్ అన్నగార్లు ఇద్దరూ, అత్తమామలతో కలసి కిరణ్ తల్లి తండ్రులు అంతా ఉమ్మడి కుటుంబమేనట. కాబోయే వియ్యంకుడికి తల్లిదండ్రులంటే చెప్పలేని ప్రేమట. వృద్ధులైన వాళ్లిద్దరినీ చంటిపిల్లల్లా అపురూపంగా చూస్తారట. ఈ మాటలు వింటున్న రాజారావు ముఖం అపరాధం చేసినట్లు మాడిపోయింది. భానుమతి ఒకపక్క భర్త ఫీలింగ్స్ గమనిస్తూ 'కొంపదీసి ఏనాడో వదిలేసిన అత్తమామల్ని పిలిపించాలా ఏమిటి?' అనుకొన్నది అనుమానంతో.

భానుమతి భయాన్ని నిజం చేస్తూ మధ్యవర్తి నవ్వుతూ ఆమె ముఖంలోని భావాలను చదువుతూ అనుకున్నాడు... వీళ్ల గురించి ఏనాడో విన్నాను రాజారావుకు తల్లిదండ్రులతో సంబంధ బాంధవ్యాలు లేవని, వీళ్లకు, వాళ్లకు పడదని. ఒక్క ముక్క పెళ్లివారి చెవిన వేస్తే చాలు. ఇటువంటి తల్లి పెంపకంలో పెరిగిన పిల్ల తను ఇంట ఎలా మసలగలదని స్వాతిని తమ ఇంటి కోడలుగా చేసుకోటానికి ఎంతమాత్రం ఒప్పుకోరు వాళ్లు. పెద్దవాళ్లకు, ఆచార, సంప్రదాయాలకు అంత విలువనిస్తారు వాళ్లు. అయినా పెళ్లిళ్లు కుదర్చటమే తప్ప చెడగొట్టే స్వభావం కాదు తనది. అనుకుంటూ "అమ్మా

## ఛార్మి ఆశలు!

ఇటీవల కాలంలో ఛార్మికి చెప్పుకోదగిన హిట్ సినిమా ఏదీ లేదు. ఒకటి రెండు సినిమాలు పూర్తయి కూడా రిలీజ్ కాకుండా అలాగే వుండిపోయాయి. 'మంత్ర' సినిమా తర్వాత ఛార్మికి మరింత క్రేజ్ వచ్చినా దానికి దగ్గ హిట్ లేకపోడం విచారకరం. తాజాగా అదే మంత్ర సినిమా దర్శకుడితో 'మంగళ' అనే సినిమా చేస్తోంది ఛార్మి. ఈ సినిమా చాలా హారర్‌గా వుంటుందని, ప్రేక్షకుల్ని ఆకట్టుకుని తనకు ఎంతో పేరు తెస్తుందనే ఆశతో వుంది ఛార్మి. మరామె ఆశలు ఎంతవరకూ 'మంగళ'తో నెరవేరతాయో చూడాలి!

ఇంతకూ నేను చెప్పేది ఏమిటంటే వారి అబ్బాయి మీ అమ్మాయిని చేసుకోవటానికి ఇష్టపడుతున్నాడని వారి మాటగా నన్ను చెప్పమన్నారు. వారి విషయాలు అన్నీ మీరు తెలుసుకున్నారు కదా! మీకు సమ్మతం అయితే వాళ్లంతా పెళ్లిచూపులకు వస్తారట. మరో ముఖ్య విషయం ఏమిటంటే మీ తరపు పెద్దవారు ఓ అత్తమామలు, తల్లీతండ్రీ పెళ్లి చూపుల నుండి అమ్మాయిని కాపురం పంపించేంత వరకు ఉండాలిట. కట్నకానుకలు ఏమీ వారికి అక్కరలేదు. పెళ్లి మాత్రం బాగా చెయాలిట. ఈ పెళ్లిచూపులు లాంఛనంగా అబ్బాయి తరపు వారు అమ్మాయిని చూడటానికి మాత్రమే. మీకు ఏమైనా అభ్యంతరాలు ఉంటే చెప్పండి. నేను వెళ్లి వారికి చెప్తాను అన్నాడు మధ్యవర్తి తన పని అయ్యింది. తాను ఇంక వెళ్లి వస్తానంటూ బయల్దేరాడు.

"అబ్బే మాకు అభ్యంతరాలు ఏమీ లేవండీ. అన్నింటికీ సమ్మతమే"

"చెప్పరేమిటండీ?" మౌనంగా అన్నీ వింటున్న రాజారావును నెమ్మదిగా చేతితో పొడుస్తూ" అన్నది ఎక్కడ బంగారం లాంటి సంబంధం చేజారిపోతుందోనని.

"అవునండీ! మాకే అభ్యంతరాలూ లేవనీ, వారిని మంచిరోజు చూసుకుని అమ్మాయిని చూడటానికి రమ్మని చెప్పండి" అన్నాడు గబగబా రాజారావు. మధ్యవర్తిని సాగనంపి లోపలికి వచ్చిన భానుమతికి ఏం చేయాలో పాలుపోవడం లేదు. అత్తమామలను తనింటికి ఆహ్వానించడం అనేది తనకు ఎంతమాత్రమూ ఇష్టం లేని పని. ఇంచుమించుగా పాతికేళ్ల నుండి ఎవరి దారి వారిదిగా బ్రతుకుతున్నారు. మనవడు పోయిన సందర్భంలో వాళ్లు వచ్చి ముళ్ల మీద ఉన్నట్లుగా 2 రోజులు ఉన్నారంతే. స్వాతి పెళ్లికి ఒక కార్డుముక్క రాసి శుభలేఖ పంపిస్తే నాలుగక్షింతలు వేసి వెళ్తారని ఇన్నాళ్ల నుండీ తాను అనుకుంటోంది. అయినా "ఇదేం పెళ్లివారు బాబూ! తమ తరపు వాళ్లతో వీళ్లకేంటో అంత ఇది. వాళ్లూ వాళ్లూ కలిసి ఉంటే ఉన్నారు. మధ్యలో మా సంగతులెందుకు? ఏనాడో వదిలేసుకున్న వాళ్లను ఇప్పుడు ఏ మొహం పెట్టుకుని ఆహ్వానిస్తుంది. అత్తగారు పట్టుదలతో తనకు సమఉజ్జీయే గానీ తనకు ఎంతమాత్రమూ తీసిపోదు అనుకుని ఏమంటారన్నట్లు భర్త వైపు చూసింది.

"ఆ మాట నన్నెందుకు అడగడం? వాళ్లు ఎలా వస్తారు? వాళ్ల యోగక్షేమాలు ఏనాడైనా కనుక్కున్నామా?" అన్నాడు రాజారావు సీరియస్‌గా.

"నాకు రావటానికి మొహం చెల్లట్లేదు. నీకు కావాలంటే నువ్వెళ్లు" అన్నాడు ఇంకో మాట లేనట్లుగా అతనే అన్నాడు మళ్లీ.

"సర్లెండి. నాకు తప్పుతుందా? ఇంకో జన్మ ఎత్తినా మనం పిల్లకు ఇలాంటి సంబంధం తేగలమా? కోరి వాళ్లంతట వాళ్లే వచ్చారు కూడా" అంది భానుమతి మనసులో మథనపడుతూ.

ఒక మంచి రోజు చూసుకుని మనవరాలిని తీసుకెళ్లి నాలుగు మంచి మాటలు మాట్లాడితే కాదనరు ముసలాళ్లు. రాకపోతే నలుగురూ వాళ్లనే అంటారు. అనుకున్న భానుమతి స్వాతితో కలిసి ఆ పల్లెటూరుకు బయలుదేరింది. భానుమతి చిన్నతనం నుండీ తల్లిమాటల వల్ల వాళ్లంటే ద్వేషం పెంచుకున్న స్వాతి తల్లి ఎంతో బ్రతిమాలితే ఎలాగో విసుక్కుంటూ బయల్దేరింది. కూతురికి అక్కడికి వెళ్లాక ఎలా మాట్లాడాలో హితబోధ చేసింది భానుమతి.

అప్పుడే భోజనాలు చేసి చేతులు కడుక్కుంటున్న ఆనందరావు, సూర్యకాంతమ్మ అనుకోకుండా వచ్చిన వీళ్లను చూసి కలా! నిజమా అన్నట్లు ఒకరి మొహాలు ఒకరు చూసుకున్నారు. తేరుకున్న ఆనందరావు "రండమ్మా లోపలికి అని ఆహ్వానించాడు. సూర్యకాంతమ్మ ఏం మాట్లాడలేదు. కనీసం కూర్చోమని కూడా అనలేదు. కొడుకు ఇంట్లో తన ఇంట్లో కోడలు చేసిన అవమానాలు గుర్తొచ్చి ఆమె మనసు మండిపోతోంది. భానుమతి అవమానం దిగమింగుకుంటూ...

"మామ్మగారు స్టన్ అయ్యారే! మనిద్దరినీ చూసి అయినా మనింట్లో మనకు మర్యాదలేంటి" అంటూనే స్వాతిని కూర్చోమని చెప్పి తను కూడా ఓ కుర్చీలో కూర్చుంది. స్వాతికి ఇదంతా చాలా చిరాగ్గా ఉన్నది. ముళ్ల మీద ఉన్నట్లు ఎలాగో కూర్చుంది.

"అత్తయ్యగారూ! ఎలా ఉన్నారు? మామయ్యగారి ఆరోగ్యం ఎలా ఉంటోంది? ఆప్యాయత ఒలకబోస్తూ అడుగుతున్న కోడలిని చూసి-

"వావివరసలు కూడా ఇంకా గుర్తున్నాయన్న మాట. మేము ఉన్నామో పోయామో చూద్దామని వచ్చారా?" అంది పెడసరంగా సూర్యకాంతమ్మ.

"అయ్యయ్యో, ఎంత మాట అన్నారు అత్తయ్యగారూ? ఏదో మీకు నచ్చినట్లుగా మీరు సొంతింట్లో ఉంటున్నారు కదా! అని ఊరుకున్నాం గానీ లేకపోతే అంతా ఒకచోట ఉండేవాళ్లమే కదా!" అంది లేని ప్రేమ ఒలకబోస్తూ భానుమతి.

"ఆహాహా! ఏం ప్రేమ కురిపిస్తున్నావు? ఇంతకీ ఎందుకు వచ్చినట్టు?" అంది సూర్యకాంతమ్మ లోపలి నుండి మంచినీళ్లు తీసుకు వచ్చి టేబుల్ మీద పెడుతూ.

అపుడు ఇంక తప్పదన్నట్లుగా.

"మీ మనవరాలికి పెళ్లి సంబంధం కుదిరిందండీ. కోటీశ్వరులు కోరి మన స్వాతిని చేసుకోబోతున్నారు. పెళ్లిచూపుల నుండి అన్నీ మీరే దగ్గరుండి జరిపించాలి" అంది ఎంతో వినయ విధేయతలు కనబరుస్తూ.

"మాకెందుకులే లేనిపోని పెద్దరికాలు. అన్నీ తెలిసిన దానివి నువ్వే చేసుకో" అంది సూర్యకాంతమ్మ ముక్తసరిగా.


ఇంతకాలం అయ్యిందేదో అయ్యింది. ఇంక మీరూ పెద్దవాళ్లు అయ్యారు. ఒక్కళ్లూ ఉండలేరు. అక్కడికే వచ్చేద్దురు గాని" అంది ఆ విషయంలో అపుడే గుర్తు వచ్చినట్లు.

"నీకు ఆ ఇంగిత జ్ఞానం ఉంటే నా ఒక్కగానొక్క కొడుకును నీ కొంగున ముడేసుకుని మమ్మల్ని దూరం చెయ్యవు వాడిని" అంది సూర్యకాంతమ్మ విసురుగా. బతిమాల్తుంటే ముసల్ది ఎంత నీలుగుతోందో! వచ్చాక చెప్తా! నీ పని అని మనసులో తిట్టుకుంటూ పళ్లు పటపటా కొరుకుతూ ఎటో చూస్తూ మనసును కంట్రోల్ చేసుకుంటూ అన్నది భానుమతి. "అలా అనకండి. అత్తయ్యగారూ! అయినా మాకు పెద్దవాళ్లు మీరు కాక ఇంకెవరున్నారని? నా తల్లీ తండ్రీ ఏనాడో పోయారు కదా!" అంది తప్పదన్నట్లుగా భానుమతి.

ఇదంతా చూస్తూ మౌనంగా వింటున్న ఆనందరావు కల్పించుకుంటూ మనవరాలిని పలకరించి "అమ్మా! జాబ్‌కు ట్రై చేస్తున్నావా? నాన్న ఎలా ఉన్నాడమ్మా? వాడికి మేము గుర్తున్నామా? ఒక్కగానొక్క కొడుకు మనసు లేకుండా ఎలా తయారయ్యాడో తలుచుకుని బాధపడుతూ అన్నాడు.

"ఆ వాడికేం నిక్షేపంలా ఉంటాడు. అయ్యో అమ్మా నాన్న నన్ను ఎలా పెంచారు? అనే విశ్వాసం లేకుండా" అంది సూర్యకాంతమ్మ.

స్వాతి కోపంతో తండ్రిని వెనకేసుకొస్తూ ఏదో అనబోతుంటే అసలు విషయం పక్కతోవ పడుతోందని గ్రహించిన భానుమతి పైకి కనిపించేవే నిజాలు కావని మీకూ తెలుసు అత్తయ్యగారూ! మామయ్యగారూ. అవన్నీ అక్కడ మాట్లాడుకుందాం.



మీరు మాతో వచ్చినా సరే లేదా రేపుమీ అబ్బాయి వచ్చి మిమ్మల్ని తీసుకొస్తారు" అంది ఇంక వెళ్లటానికి లేచి నిలబడుతూ.

"ఏమే స్వాతీ! మేము ఎప్పుడైనా గుర్తొస్తామా అసలు? అయినా నిన్ను మీ అమ్మ ఎప్పుడు రానిచ్చింది మా దగ్గరికి. పోయిన ఆ పిల్లాడినీ అంతే" అని కోడలి వైపు చూస్తూ ఇంక తప్పదన్నట్లుగా పెళ్లివారిని గురించిన వివరాలు అడిగింది. పెళ్లివారి ప్రస్తావన రాగానే భానుమతి కళ్లు మెరిశాయి. వారి వివరాలు చెప్పింది ఆనందంగా.. "పెళ్లిచూపులు లాంఛనమే. మీరు 2 రోజులలో బయలుదేరి రండి" అని మామగారికి కూడా చెప్పి కూతురిని కూడా చెప్పమని సైగ చేసి వెళ్లటానికి లేచి నిలబడింది.

వివరాలన్నీ విన్న సూర్యకాంతమ్మ మనసులో ఆలోచనలు చకచకా మారిపోయాయి. "అలాగా! బావుంది. భోజనాలు చేశారా? ఇపుడే కాసిని బియ్యం పడేస్తాను" అంది వంటగదిలోకి వెళ్లబోతూ.

"మీకు ఆ శ్రమ ఏమీ వద్దు అత్తయ్యగారూ! మేము హోటల్‌లో భోజనం చేసే వచ్చాం" అంది భానుమతి నీ బోడి భోజనం కోసం ఎవడేడ్చాడు అనుకుంటూ మనసులోనే అత్తగారిని శాపనార్థాలు పెడుతూ.

"సరే" అంటూ నిలబడిపోయిన అత్తమామలతో మరీమరీ చెప్పి బయల్దేరింది. భానుమతి కూతురిని తీసుకుని.

"అబ్బ ఏంటమ్మా! ఆవిడ అలా మాట్లాడుతుంటే నువ్వెంత సహనంగా ఎలా ఊరుకున్నావో గానీ నాకు చాలా చిరాకొచ్చింది" అంది స్వాతి.

"అంతేనే! ఆ మహాతల్లి, నీకు కాబోయే అత్తవారి చాదస్తాల వల్ల వాళ్ల మొహాలు చూసి బ్రతిమాలక తప్పలేదు" అంది భానుమతి నిరసనగా చూస్తూ తన తప్పేం లేదన్నట్లు.

భానుమతి, స్వాతి అటు తిరగగానే "ఏమి అదృష్టం. తల్లిని మించి పోయింది. కాళ్ల దగ్గరకే వచ్చింది కనక సింహాసనం చూడాలి పెళ్లి ఎలా జరుగుతుందో చాలా ఐశ్వర్యవంతులట" అంది పెళ్లి అపుడే జరగబోతున్నట్లుగా సూర్యకాంతమ్మ.

"అపుడే రెడీ అయిపోతున్నావేమిటి పెళ్లికి?" అన్నాడు ఆనందరావు గారు వేళాకోళంగా.

"వెళ్లక ఏం చేస్తాం. పిలిచినా రాలేదని మననే ఆడిపోసుకుంటారు. చూద్దాం మీ కొడుకును రానీయండి" అంది ఆమె.

భానుమతి ఆదేశం ప్రకారం 2 రోజులు తర్వాత తల్లి దండ్రుల దగ్గరకు వచ్చాడు రాజారావు. కొడుకుకు ముందు అష్టోత్తర, శత, సహస్రాలతో దీవనలు అందించిన తర్వాత భోజనం పెట్టింది సూర్యకాంతమ్మ.

భార్య ఒత్తిడికి తలవంచి తల్లి ధోరణిని భరించలేక తాను వారికి దూరం కావటం జరిగిందనే విషయం చూచాయగా స్పష్టంగా చేసిన రాజారావు తల్లిదండ్రులను తీసుకొని హైదరాబాద్ బయల్దేరాడు.

అత్తగారినీ మామగారినీ సాదరంగా ఆహ్వానించి సకల మర్యాదలూ చేసింది భానుమతి. కోడలు మారిపోయిందా అని వారు భ్రమ పడేటట్లుగా. ఇదంతా చూస్తున్న స్వాతికి ఒక్రపక్క కోపం, నవ్వు రెండూ వస్తున్నాయి. తల్లి నటించలేక పడుతున్న శ్రమ చూసి...

మంచి రోజు చూసి పెళ్లిచూపులు నిర్ణయించారు. పెళ్లివారంతా రెండు కార్లలో పాతికమంది వరకు వచ్చారు. కిరణ్ ఇదివరకే స్వాతిని చూసి వచ్చి ఉండటంతో అతని తరపు వాళ్లంతా చూసి సానుకూలంగానే స్పందించారు. స్వాతి అందం, నెమ్మదితనం వాళ్లకు బాగా నచ్చాయి. రాజారావు తల్లి దండ్రులను వారికి పరిచయం చేశాడు. కాబోయే వియ్యంకుడు ఆనందరావును వదల్లేదు. తన తండ్రి పట్ల చూసే ఆపేక్ష ఆయన పట్ల కూడా వ్యక్తం చేయటంతో మనుషులంటే మొహం వాచి ఉన్నట్లుగా ఉన్న ఆనందరావులో కొత్త ఉత్సాహం వెల్లివిరిసింది. సూర్యకాంతమ్మను కూడా కాబోయే వియ్యాలవారు ఎంతో గౌరవంతో చూసి అభిమానంగా మాట్లాడటంతో ఆమె ఆనందానికి అవధుల్లేవు. కోడలి ముఖంలో మారుతున్న రంగులను ఆమె గమనిస్తూనే ఉంది. భానుమతికి ఇదంతా చూస్తుంటే ఒంటికి కారం రాసుకున్నట్లుగా ఉన్నది. తమతో సమానంగా ఏమిటి ఇంత ఇదిగా చూస్తున్నారు వీళ్లు అత్తమామలను అనుకున్నది అసహనంగా. స్వాతికి కూడా కిరణ్ నచ్చటంతో ఇంక పెళ్లికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లయింది.

కాఫీ, టిఫిన్లు పూర్తి అయ్యాక చొరవ తీసుకుని రాజారావు అన్నాడు వియ్యంకుడితో "అక్కయ్యగారూ, బావగారూ! మీ అభిప్రాయం చెపితే తాంబూలాలకు ముహూర్తం గురించి మాట్లాడుకుందాం" అన్నాడు వినయంగా.


"అలాగే తప్పకుండా మేము మా పురోహితుడితో కబురు పంపిస్తాం" అన్నారు సూర్యారావుగారు.

సాదరంగా వారిని కారు వరకు సాగనంపి వచ్చిన రాజారావుదంపతులు కూతురికి పట్టిన అదృష్టం గురించి మాట్లాడుకుని మురిసిపోయారు. భానుమతికి వచ్చిన వారి ఒంటి నిండా బంగారం, ఖరీదైన పట్టుచీరలు చూస్తే నోట మాట రాలేదు. అంత ఐశ్వర్యం ఉన్నా ఎవరికీ తలబిరుసుతనం లేదు. అంతా కలుపుగోలుగా మాట్లాడారు అనుకున్నది మనస్ఫూర్తిగా. ఆనందరావు దంపతులకు కూడా చాలా ఆనందంగా ఉన్నది ఇదంతా చూస్తుంటే.

ఒక మంచిరోజు చూసి తాంబూలాలు నిశ్చయించారు రాజారావు ఇంటిలోనే. భానుమతి హడావుడికి అంతులేదు. ఆ రోజే పెళ్లి అన్నట్లుగా కంగారుపడుతోంది. స్వాతి కాబోయే అత్తగారు విశాలాక్షి భానుమతికి సూర్యకాంతమ్మకు పట్టుచీరలు పట్టుకొచ్చి పెట్టింది. స్వాతికి 10వేల రూపాయల పట్టుచీర, నెక్లెస్ పెట్టింది. భానుమతి కూడా వాళ్ల హోదాకు సరిపోతాయో లేదో అనుకుంటూనే వచ్చిన వారందరికీ ఖరీదైన బట్టలు పెట్టింది. షడ్రసోపేతమైన రుచులలో, కులాసా కబుర్లు చెప్పుకుంటూ అందరూ భోజనాలు పూర్తి చేశారు. కిరణ్‌కు ఇంక 20 రోజులలో పెళ్లి ముహూర్తం నిర్ణయించటానికి కుదురుతుందో లేదోనని రాజారావును అడిగి మంచి రోజున ముహూర్తం పెట్టారు. వచ్చే నెలలో కిరణ్ స్టేట్స్‌కు వెళ్లిపోవాలట. అందుకనే ఇంత తొందరని చెప్పారు. తనకు ఏమీ ఇబ్బంది లేదని పెళ్లి పనులు మొదలుపెట్టాడు రాజారావు. కల్యాణమండపం (ఎ.సి.) బుక్ చేశాడు. పక్కనే ఇ.ఎ.సి. ఫ్లాట్స్ పెళ్లి వారికి బుక్ చేశాడు.

ఇంక భానుమతి హడావుడికి అంతు లేదు. కాళ్లకు చక్రాలు కట్టుకున్నట్లుగా విజయవాడలో ఉన్న తన ఇద్దరు ఫ్రెండ్స్‌తో కలిసి బట్టలషాపులకు బంగారం షాపులకూ తిరిగింది. పెళ్లికొడుక్కి గొలుసు, ఉంగరం, వెండి కంచం, వెండి చెంబు, పట్టుబట్టలు కొన్నది. పెళ్లి వారందరికీ పట్టు చీరలు కొన్నది. తప్పదని అత్తమామలకు 5, 6 వందలలో బట్టలు కొన్నది. వియ్యాలవారు అత్తమామలకు చేస్తున్న మర్యాదలు చూస్తుంటే ఆమెకు ఒళ్లు మండిపోతోంది.

పెళ్లి కాగానే స్వాతితో తన ఇద్దరు మరదళ్లను పంపాలని నిశ్చయించుకున్నది. వాళ్ల హోదా చూసి తను ఏమీ మాట్లాడలేకపోతోంది అనుకున్నది . అందరూ ఎదురుచూస్తున్న రోజు రానే వచ్చింది. భానుమతి విడిదిలో పెళ్లివారికి కావల్సిన ఏర్పాట్లు అన్నీ చూడటానికి నలుగురు మనుషులను పెట్టింది. స్వాతి పెళ్లికూతురి అలంకరణలో మెరిసిపోతోంది.



రాజారావు చెల్లెలు శారద పెళ్లి ముందు రోజే వచ్చింది. తాంబూలాలకు కూడా హడావుడిగా వచ్చి వెళ్లిపోయింది ఏవో పనులున్నాయని. వదినగారి మర్యాదలు, తల్లిదండ్రులను చూస్తున్న తీరు చూసి కొత్తగా ఏం ప్లాన్ చేసిందో, అనుకున్నది శారద. భానుమతికి కాబోయే వియ్యాల వారు స్వాతికి ఒక్కగానొక్క మేనత్త అని చాలా మర్యాద గౌరవం ఇచ్చారు. అంత ఆస్తిపరులైనా గానీ ఏమాత్రం భేషజం లేకుండా పెళ్లి వారంతా తమతో అంత ఆత్మీయంగా, అభిమానంగా ఉండటం చూసి చిన్నప్పటి నుండి ఒంటెత్తు పోకడలతో పెరిగిన స్వాతి మనసులో విశాల భావాలు కొత్త ఆలోచనలు వెల్లువెత్తాయి. చిన్న విషయాలకే ఎంతో ఆర్భాటం చేసి తన ఆధిక్యతను చాటుకునే తల్లి చేష్టలు గుర్తుకొస్తుంటే వీళ్ల ముందు తాము ఎంత అనిపించింది స్వాతికి.

పెళ్లివారు చిన్న చిన్న లోపాలున్నా సర్దుకుపోతున్నారు. తెలిసిన వాళ్లంతా స్వాతి అదృష్టం గురించి పొగుడుతుంటే, భానుమతికి ఆకాశంలో హాయిగా విహరిస్తున్నట్లనిపించింది. పెళ్లి తంతు మొదలు కావటంతో భానుమతి, రాజారావు వచ్చినవారందరినీ సాదరంగా ఆహ్వానిస్తున్నారు. భానుమతి పట్టించుకోకుండా వదిలేద్దామన్నా కానీ స్వాతి అత్తగారు, ఆమె అత్తగారు శారదను, సూర్యకాంతమ్మను వాళ్ల మధ్య కూర్చోబెట్టి కబుర్లు చెప్తుంటే భానుమతి హృదయంలో సన్నగా చెలరేగిన మంట ఉధృతం కాసాగింది. అంతేకాదు రాజారావు కూడా వియ్యంకుడి పంథాలో అంతకుముందే అతని హృదయంలో కలిగిన పశ్చాత్తాపం కారణంగా తల్లిదండ్రులను వచ్చిన దగ్గర నుండి ఆప్యాయంగానే చూస్తున్నాడు. కొడుకులో వచ్చిన మార్పుకు ఆనందరావు దంపతుల మనస్సులు సంతోషపడి "వాడికి మాత్రం తల్లీ తండ్రీ అంటే ప్రేమ ఉండదా మరి! ఆ మహాతల్లి ఇన్నాళ్లు దగ్గరకు రానివ్వదు కాబట్టి గానీ" అనుకున్నారు.

పెళ్లి వైభవంగా జరిగింది. వేదమంత్రాల సాక్షిగా కిరణ్, స్వాతి ఇద్దరూ ఒకటైనారు. భోజనాలు పూర్తయ్యాక స్వాతిని తీసుకెళ్లేందుకు స్వాతితో అత్తగారిని, ఆడపడుచును పంపమని అడిగేందుకు భానుమతి దగ్గరకు వచ్చింది విశాలాక్షి. "ఇంకా మీ తరపున ఎవరైనా ఉంటే వాళ్లని పంపించండి వదినగారూ! అంది ఆమె. వియ్యపురాలి హుందాతనం ముందు పోతపోసిన బంగారు ముద్దలా ఉన్న అలంకరణ ముందు తాను తీసికట్టు అనిపిస్తుంది. ప్రతీదానికీ ఇంక వాళ్లేనా? నా వెనకే తిరుగుతున్న ఆ మరదళ్లు వీళ్లకు కనిపించరా? వాళ్లిద్దరినీ స్వాతి వెంట పంపిద్దామని తాను అనుకుంటుంది. ఈవిడ ఇలా అడుగుతుందేమిటి? మనసులో ఆగ్రహపడినా గానీ ఆమెను చూస్తే రూపకారి అయిన భానుమతి నోరు పెగలదు. వాళ్లెందుకు, నా మరదళ్లను పంపిస్తానంటే ఏమనుకుంటారో" అని మౌనంగా సరేనని తలూపింది.

వియ్యపురాలిని పంపిన భానుమతి అలాగే సోఫాలో కూలబడిపోయింది. ఆమె ఉత్సాహమంతా చచ్చిపోయినట్లుంది. ఏమిటి వీళ్ల ధోరణి? పెద్దవాళ్లకు గౌరవం ఇవ్వాలనే ఆలోచన తప్ప తమ అభిప్రాయాలు ఏమీ అక్కర్లేదా? ఏదో 4 రోజులు ఉంచి పంపించేద్దాం అనుకుంటే అత్తమామ, ఇక్కడే తిష్ట వేసేలా ఉన్నారు. దానికి తోడు వాళ్లను తీసుకువచ్చిన నాటి నుండి రాజారావు అమ్మానాన్నా అంటూ ఇపుడు వియ్యంకుడిలా గానే తయారయ్యాడు. తనైతే నటిస్తోంది గానీ అతను మనస్ఫూర్తిగానే వాళ్లమీద ప్రేమ చూపిస్తున్నట్లు అనిపిస్తుంది. అదే నిజమైతే తన అభిప్రాయాలు ఎవరు పట్టించుకుంటారు? అత్తమామలతో పరుషంగా ప్రవర్తిస్తే అవతల వియ్యాలవారి దృష్టిలో చులకన అవుతాము. తానెంతగానో ద్వేషించే అత్తమామలను తనతో సమంగా చూస్తున్నారు. ఇంత కన్నా తనకు, అవమానం ఇంకేముంటుంది అనుకున్నది ఆమె.

ఈ ఆలోచనలతో ఆమె మనసు కుతకుతలాడుతుంటే గుమ్మం దగ్గిర చప్పుడైతే తలెత్తి చూసింది భానుమతి. స్వాతి నెమ్మదిగా వస్తోంది. కొత్త అందాలతో మెరిసిపోతున్న కూతురిని చూసి సర్వం మరచి ఆమె నుదుట ముద్దు పెట్టుకుని దగ్గరకు తీసుకుంది. తల్లి మనసును చదివినట్లుగా అన్నది స్వాతి.

"ఎందుకమ్మా! అక్కడ అంత హడావుడిగా ఉంటే నువ్వు ఒక్కదానివే ఇలా ఒంటరిగా కూర్చున్నావు. నీ చుట్టూ ఎంతోమంది ఉన్నాగానీ నీకు నీవు ఒక గిరి గీసుకుని బ్రతికావు ఇంతకాలం. నన్ను కూడా అలాగే పెంచావు. నీకు నేను ఎన్నోసార్లు చెప్పాలని ప్రయత్నించి నా మీద నువ్వు పెంచుకున్న అపురూపమైన ప్రేమతో ఎక్కడ నువ్వు బాధపడతావోనని నువ్వు చెప్పిన ప్రతీదానికీ తలాడించాను. ఇన్నేళ్లొచ్చాక ఇపుడు నువ్వు నన్ను విమర్శించేంత దానివి అయ్యావా? అని అనుకోకమ్మా! వీళ్లందరూ చూడు మనస్ఫూర్తిగా మాట్లాడుతున్నారు. మనస్ఫూర్తిగా నవ్వుతున్నారు. ఎంత సంతోషంగా ఉన్నారో చూడు. పైకి నువ్వు కూడా నవ్వుతూనే ఉన్నాగానీ నిజంగా నువ్వు ఆనందంగా ఉన్నావా? ఒక్కసారి నిన్ను నువ్వు పరిశీలించుకో. మామ్మా, తాతయ్యల నుండి నాన్నను విడదీసి నువ్వు ఏం సాధించావమ్మా? మా అత్తగారు వాళ్లంతా మామ్మ తాతయ్యలకు ఇస్తున్న ఇంపార్టెన్స్ చూసి నీలో నువ్వు ఎంత ఆగ్రహంతో ఉన్నారో నేను ఊహించగలనమ్మా? కానీ ఒక్క మాట! వాళ్లూ పెద్దవాళ్లు అయిపోయారు. తప్పులు అందరూ చేస్తారు. మామ్మది సాధింపుధోరణే. కాదనను. కానీ ఎందుకలా ఉన్నది ఆమె? ఒక్కగానొక్క కొడుకు దూరమైన బాధ. ఇక్కడికి వచ్చాక ఆ మనిషే మారిపోయింది. నాన్న వాళ్ల పట్ల చూపిస్తున్న ఆప్యాయతే అందుకు కారణం. "అన్నయ్య బ్రతికుంటే నువ్వు అన్నయ్య నీ దగ్గిరే ఉండాలని అనుకునేదానివి కాదా? అమ్మా! నీకు ఒక విషయం తెలుసా అమ్మా! మా అత్తగారిని వాళ్ల అత్తగారు అంత ప్రేమగా చూస్తున్నా ఏదో ఒకటి సాధిస్తుంది అప్పుడప్పుడు. అయినా అత్తయ్యగారు చిరునవ్వుతో వదిలేస్తుంది. అసలు పట్టించుకోదు.

నేను పెంచిన గారాల కూతురు ఇలా మాట్లాడతోందేమిటి అనుకోకు అమ్మా! ఒక్కసారి ఆత్మపరిశీలన చేసుకో. నువ్వు గమనించావో లేదో గానీ నాన్న కూడా ఇదివరకు డల్‌గా ఉండే మనిషి, ఇపుడు చాలా హుషారుగా ఉంటున్నారు. వాళ్లని ఆపేక్షగా చూస్తున్నారు. అత్తయ్యలిద్దరూ నువ్వంటే గజగజలాడిపోతారని నువ్వు ఎంతో గర్వంగా ఫీలవుతావు. కానీ వాళ్లు నీ వెనకాల నిన్ను ఎలా తిట్టుకుంటారో నాకు తెలుసు. గొడవలెందుకని ఎపుడూ నీతో చెప్పలేదు నేను. అన్నయ్య పోయాక నువ్వు నాన్న నా మీద పంచప్రాణాలు పెట్టుకొని బ్రతుకుతున్నారని నాకు తెలుసు. ఒంటరిగా విడిగా ఉండటంలో ఆనందం లేదమ్మా. ఒకరి మీద పెత్తనం చెలాయించటం ఆధిపత్యం కాదమ్మా! నువ్వు మనస్ఫూర్తిగా మామ్మను, తాతయ్యను గౌరవించి అభిమానించిననాడు నీ ఆధిక్యమే కనపడుతుంది. ఒక్కసారి ఆలోచించి చూడమ్మా! ఈ సమయంలో నాన్న మనసును బాధపెట్టి నువ్వు బాధపడి సాధించేది ఏముందమ్మా! నీ ఆలోచనా దృక్పథం మారిన నాడు నీకు ఎటువంటి కోపమూ, బాధ ఉండవు. గతాన్ని వదిలేయి. అప్పుడు నీ మనసుకు నీవే అధిపతివి అవుతావు" అంటూ అక్కడి నుండి స్వాతి నెమ్మదిగా నిష్క్రమిస్తుంటే చేష్టలుడిగి చూస్తోంది భానుమతి.

☆

